RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 75 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం శుక్రవారం, 20 సెప్టెంబర్ 2024 పేజీలు : 4 వెల : 2/-



# అటు రేవంత్ .. ఇటు కేటీఆర్..

## ఒకే వేదికపైకి రాజకీయ ప్రత్యర్థులు..

### 21న ఏచూరి సంస్మరణ సభలో పాల్గొననున్న అధికార - ప్రతిపక్ష నేతలు

హైదరాబాద్ : కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్.. మాటల తూటాలు ఎలా పేలుతాయో మనం ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.. వార్ వన్ సైడ్ కాదు.. టూ సైడ్.. అనేలా ఉంటాయి.. ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ సవాళ్లు ఎలా ఉంటాయో ఇంకా చెప్పాల్సిన పనే ఉండదు.. ప్రస్తుతం వాళ్లిద్దరి మధ్యనే మాటల యుద్ధం తీవ్రస్థాయిలో కొనసాగుతోంది.. ఏ విషయం పైనేనా.. వాళ్లిద్దరూ హెూరాహెూరీగా సవాళ్లు చేసుకుంటుంటారు.. ప్రస్తుతం కేటీఆర్, రేవంత్ రెడ్డి మధ్య మాటల యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకుంది. ఒకరిపై ఒకరు విపరీతమైన భాషలో విరుచుపడుతున్నారు. ప్రతిరోజు ఇద్దరి మధ్య ట్వీట్ల వార్ కూడా నడుస్తుంది. అసెంబ్లీలోనూ అదే కొట్లాట.. రాజకీయంగానే అదే పొట్లాట.. రాజకీయంగా రెండు విభిన్న పార్టీలు రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు.. ఇటు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, అటు ప్రతిపక్ష పార్టీ నేతగా కేటీఆర్.. డైలీ ఏదో ఒక విషయంపై స్పందిస్తుంటారు. గతంలో కంటే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఇద్దరి మధ్య తీవ్ర రాజకీయ యుద్ధం నడుస్తుంది. అలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు ఇద్దరూ.. ఒకే వేదికను పంచుకోనున్నారు. ఇదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తి రేపుతుంది. అదేంటి..? ఇద్దరూ ఒకే వేదికపై వస్తారా..? ఈ క్రమంలో ఇద్దరూ పలకరించుకుంటారా? ఒకరికొకరు షేక్ హ్యాండ్ ఇచ్చుకుంటారా? అనేది అందరిలోనూ ఆసక్తి రేపుతోంది.. అయితే.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కేసిఆర్ ఆసుపత్రిలో ఉండగా వెళ్లి పరామర్శించారు. ఆ సందర్భంలో కేటీఆర్ స్వయంగా ఆసుపత్రిలో దగ్గరుండి తీసుకెళ్లారు. ఇద్దరు ఆప్యాయంగానే మాట్లాడుకున్నారు. కానీ అప్పటికి ఇప్పటికీ పరిస్థితి వేరు.. ఇలాంటి పరిస్థితుల్లో వామపక్ష పార్టీ సీపీఎం నిర్వహించే సీతారాం ఏచూరీ సంస్మరణ సభలో ఇద్దరూ వేదికపై కనిపించనున్నారు. సెప్టెంబర్ 21న వామపక్ష దిగ్గజం, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి స్వర్గీయ సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఉంది. ఆయన తెలుగు వ్యక్తి కావడంతో హైదరాబాదులో ఆ పార్టీ సంస్మరణ సభను ఏర్పాటు చేసింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఇటు సీఎం రేవంత్ రెడ్డిని అటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరినీ ఆహ్వానించారు. రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని.. సీతారాం ఏచూరి గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని ఇద్దరు కచ్చితంగా హాజరయ్యే అవకాశం ఉంది. ఒకే వేదికపై ఇద్దరు రాజకీయ బద్ధ శత్రువులు కూర్చోనున్నారు. సమావేశం ఏదైనా ఇద్దరు ఒకరినొకరు ఎలా పలకరించుకుంటారు అనేది ఇప్పుడు అందరిలో ఆసక్తి నెలకొంది.

# ఇజ్జత్ కా సవాల్.. ఎమ్మెల్సీ ఎన్నికలు.. బండి వ్యూహం ఇదే..!

కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరుగనున్నాయి. ఆ ఎన్నికలు బిజేపికి, మరి ముఖ్యంగా కేంద్ర సహాయమంత్రి బండిసంజయ్‌కి అత్యంత కీలకంగా మారాయి. ఆ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించిన ఓటర్లు ఉన్న కరీంనగర్, అదిలాబాదు, నిజామాబాదు, మెదక్‌లలో బీజేపీ ఎంపీలే గెలిచారు. పార్లమెంటు ఎన్నికల తరువాత బండి సంజయ్ ప్రాతినిధ్యం వహిస్తున్న సెగ్మెంట్లో జరగనున్న మొదటి ఎన్నికలు కావడంతో ఆయనతో పాటు మిగిలిన ముగ్గురు ఎంపీలకు కూడా ఎమ్మెల్సీ ఎన్నిక అత్యంత ప్రతిష్టాత్మకంగా మారనుంది. ఉత్తర తెలంగాణ జిల్లాలో మరో ఎన్నికల సంగ్రామానికి రంగం సిద్ధం అవుతుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి మరికొద్ది నెలల్లో షెడ్యూల్ విడుదల కానుంది. ఈ ఎన్నికపై ఇప్పటికే బీజేపీ ఫోకస్ పెట్టింది. కరీంనగర్ ఎమ్మెల్సీ స్థానం పరిధిలో ఉన్న కరీంనగర్, అదిలాబాదు, నిజామాబాదు, మెదక్ పార్లమెంట్లు స్థానాల్లో బీజేపీ ఎంపీలే గెలిచారు. నాలుగు ఎంపి స్థానాలలో బిజెపి విజయం సాధించడం ఆ పార్టీకి ప్లస్ పాయింట్ గా మారింది. కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఇప్పటికే ఆ ఎన్నికలపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం జరుగుతున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల అంశాన్ని ప్రస్తావన తీసుకు వస్తున్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికే టికెట్ ఇస్తామని ప్రతి సమావేశంలో చెబుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యతలని పూర్తిగా బండి సంజయ్ తన భుజానికి ఎత్తుకున్నట్లు కనిపిస్తున్నారు. ఆ సీటు గెలుచుకునేందుకు ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నారు. ముఖ్యంగా బిజేపి అనుబంధ సంస్థలు




, పట్టభద్రుల ఓటర్ల ఎన్‌రోల్మెంట్‌పై దృష్టి సారించారు. క్యాండెట్‌తో సంబంధం లేకుండా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చెబడుతున్నారు. ముఖ్యంగా బిజేపి అనుకూలంగా ఉన్నవారితో ఓట్లు నమోదు చేయిస్తున్నారు. కాంగ్రెస్, బీఅర్ఎస్‌కి ధీటైన అభ్యర్ధి కోసం అన్వేషణ మొదలు పెట్టారు. నాలుగు ఉమ్మడి జిల్లాలలోని ముఖ్య నేతల సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీలో సంజయ్ సీనియర్ నేత కావడంతో అయనకి ఈ గెలుపు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారనుంది. ఆ క్రమంలో ఎమ్మెల్సీపై మరింత ఫోకస్ పెట్టి సంఘ్ పరివార్ నేతల అలోచనలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఎంపీ ఎన్నికలలో లాగా ఎమ్మెల్సీ ఎన్నికలలో కూడ కలిసి పని చేయడానికి ఓస మన్వయ కమిటీని కూడా బీజేపీ ఏర్పాటు చేయనుంది. స్థానికసంస్థలు, ఉపాధ్యయ ఎమ్మెల్సీల పదవీకాలం కూడా ముగుస్తుండడం తో ఇప్పుడు బిజెపి ఎన్నికలపై నజర్ పెట్టింది. కరీంనగర్ ఎమ్మెల్సీగా పోటి చేయడానికి చాలమంది అశావాహులు ముందుకు వస్తున్నారు. బీజేపీ నేత రాణిరుద్రమ పోటీకి సిద్దం అవుతున్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆమె స్వతంత్ర అభ్యర్థిగా పోటిచేశారు. ఆమెకు బండి సంజయ్ కొటరీ మెంబర్ అన్న ముద్ర ఉంది. దాంతో ఈ సారి రాణిరుద్రమ అభ్యర్థిత్వన్నే కన్ఫమ్ చేస్తారన్న టాక్ నడుస్తుంది. మరో సీనియర్ నాయకులు సుగుణకర్‌రావు బీజేపీ అభ్యర్థిత్వం ఆశిస్తున్నారు. గతంతో పోలిస్తే బిజేపీ ఈసారి చాలా బలపడడంతో పాటు కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పార్లమెంటు స్థానాలలో బిజెపి ఎంపీలు ఉండడంతో ఈ ఎమ్మెల్సీ స్థానం పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారింది. బిజేపీ తరుపున గెలిచిన 8 మంది ఎమ్మెల్యేల్లో అత్యధికులు కూడా ఈ నాలుగు ఉమ్మడి జిల్లాలకు చెందిన వారే. ఆ లెక్కలతో ఈ స్థానం నుంచి పోటీకి ఆశావహులు కూడా పెరుగుతున్నారు.

ఎన్నికలకు ఇంకా టైం ఉన్నప్పటికీ బండి సంజయ్ ఇప్పటి నుండే దృష్టి పెట్టి సభ్యత్వ నమోదును పెంచాలని పార్టీ క్యాడర్‌కి పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికే పదవులు ఇస్తామని చెప్పుతుండడంతో ఇప్పుడు అటు ఓటర్ల నమోదు, ఇటు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ఆశావహులు బిజీ అవుతున్నారు.



## తెలంగాణ ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాణి కుముదిని

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నియమితులైన ఐఏఎస్ అధికారిణి రాణి కుముదిని బాధ్యతలు స్వీకరించారు. 1988 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన రాణి కుముదిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ హెూదాల్లో పనిచేసి గత జులైలో పదవీ విరమణ పొందారు. రాణి కుముదిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రెడ్రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది.

గురువారం మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ఎస్ఈసీగా ఆమె బాధ్యతలు చేపట్టారు. మూడేళ్లపాటు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా కొనసాగనున్నారు.



# 543 కాదు... 750 స్థానాలు

## భారీగా పెరగనున్న పార్లమెంటు స్థానాలు!

## 2026తో ముగియనున్న విభజన నిషేదం!!

## దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యంపై తీవ్ర ప్రభావం

2029లో పెరిగిన సీట్లతో తదుపరి లోక్‌సభ ఎన్నికలు జరగవచ్చు. 2002 డీలిమిటేషన్ చట్టం 2026 వరకూ లోక్‌సభ స్థానాలను పెంపును నిషేధించింది.

2026 తర్వాత జరిగే జనాభా లెక్కల ఆధారంగానే సీట్ల విభజన జరగాలని చట్టంలో స్పష్టం చేశారు. 2027లో జనాభా గణన నిర్వహిస్తే.. డేటా ఆధారంగా డీలిమిట్ చేయడంలో ఇబ్బంది ఉండదు. కరోనా కారణంగా 2021లో జరగాల్సిన జనాభా గణనను.. 2027లో నిర్వహించే అవకాశం ఉంది. ఇది 2002 నాటి డీలిమిటేషన్ చట్టాన్ని సవరించకుండా 2029కి ముందు డీలిమిటేషన్‌కు మార్గం సుగమం చేస్తుంది. 2002 నాటి డీలిమిటేషన్ చట్టంలో లోక్‌సభ సీట్లను పెంచకుండా జనాభా పంపిణీ ఆధారంగా సీట్ల డీలిమిటేషన్‌ను ఏర్పాటు చేశారు. దీని ఆధారంగా 2008లో లోక్‌సభ స్థానాల విభజన జరిగింది. 2026 వరకు నిషేధం ఉండడంతో పాటు ఆ తర్వాత జరగాల్సిన జనాభా లెక్కల ఆధారంగా.. డీలిమిటేషన్ జరగాలనే షరతు ఉండడంతో 2031 జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ జరుగుతఓుందని భావించారు. కానీ 2027లో జనాభా గణన జరుగనుంది. దీంతో 2031 జనాభా లెక్కల కోసం డీలిమిటేషన్ కోసం వేచి ఉండాల్సిన అవసరం లేదు. 2029 తదుపరి లోక్‌సభ ఎన్నికలు 543 స్థానాలకు బదులుగా దాదాపు 750 స్థానాలకు డీలిమిటేషన్ తర్వాత జరుగుతాయని.. అందులో నారీ శక్తి వందన్ చట్టం ప్రకారం.. మూడింట ఒక వంతు సీట్లు మహిళలకు రిజర్వ్ చేయబడతాయని చర్చ జరుగుతుంది. లోక్‌సభ సీట్ల పెంపునకు దక్షిణాది రాష్ట్రాల వ్యతిరేకతే అతిపెద్ద అడ్డంకి. జనాభా పెరుగుదల రేటును విజయవంతంగా అరికట్టడం వల్ల దక్షిణ భారతదేశంలోని రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల ఉత్తర భారత రాష్ట్రాల కంటే తక్కువగా ఉంది. సమాన జనాభా ప్రాతిపదికన సీట్లను నిర్ణయిస్తే.. లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పడిపోవచ్చు.. దానిని వారు వ్యతిరేకిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల ఆందోళనల గురించి కేంద్ర ప్రభుత్వానికి తెలుసు.. డీలిమిటేషన్ సమయంలో వారి ప్రయోజనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించడంపై దృష్టి పెడుతుంది.

దీని కింద కేవలం జనాభా ప్రాతిపదికన సీట్లను నిర్ణయించే బదులు ఉత్తర భారత, దక్షిణ భారత రాష్ట్రాల మధ్య దామాషా విధానంలో సీట్లను పెంచేందుకు ఫార్ములా రూపొందించవచ్చు. తద్వారా దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ ప్రాతినిధ్యంపై ప్రభావం పడదు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## అక్కడ భారతీయ విద్యార్థులకు డేంజర్ బెల్స్!

భారతీయులు గత కొన్నేళ్లుగా కెనడాకు ఎక్కువగా వెళ్తున్నారు. ముఖ్యంగా అమెరికాకు వెళ్లాలనుకునేవారికి త్వరగా వీసాలు లభించకపోవడంతో ప్రత్యామ్నాయంగా కెనడాను ఎంచుకుంటున్నారు. అమెరికా, కెనడా రెండూ సరిహద్దు దేశాలు. అంతేకాకుండా ప్రపంచంలోనే వైశాల్యంపరంగా రెండో పెద్ద దేశం కెనడా. అక్కడ వివిధ రంగాల్లో మానవ వనరుల కొరత విపరీతంగా ఉంది. కావాల్సినంత భూమి ఉన్నా అందుకు తగ్గ జనాభా లేరు. ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా పెద్ద సంఖ్యలో వలసలను ఆ దేశం ఆహ్వానించింది. కెనడా ఆహ్వానాన్ని అప్పట్లో అందరిలాగే భారతీయులు అందిపుచ్చుకున్నారు. భారీగా కెనడాకు వెళ్లారు. ముఖ్యంగా ఉన్నత విద్య కోసం ఆ దేశానికి వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య పెరిగింది. ప్రపంచంలోనే టాప్ 200 విశ్వవిద్యాలయాల్లో కొన్ని కెనడాలో కూడా ఉన్నాయి. ఇంగ్లిష్ స్పీకింగ్ కంట్రీ కావడం, అమెరికా పక్కనే ఉండటం వంటి కారణాలతో ఇతర దేశాలతో పోలిస్తే కెనడాకు వెళ్లే భారతీయుల సంఖ్య భారీగా పెరిగింది. అందులోనూ అమెరికా వీసా దక్కనివారు ముందు కెనడాకు వెళ్తే అక్కడి నుంచి అమెరికా వెళ్లడం సులువుతుందని కెనడాను ఎంచుకుంటున్నారు. అయితే ఈ వలసలు ఇటీవల కాలంలో ఎక్కువ కావడం, కొన్ని చోట్ల కెనడియన్ల కంటే ఎక్కువ సంఖ్యలో విదేశీయులు ఉండటం వంటివి తలెత్తాయి. ముఖ్యంగా వలసలు ఎక్కువ కావడంతో గృహాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో ఇళ్ల ఖర్చు భారీగా పెరిగిపోయింది. దీంతో స్థానిక కెనడియన్లు భగ్గుమన్నారు. వలసల వల్ల కెనడియన్లు వెనుకబడిపోతున్నారని, ఉద్యోగాల్లోనూ వలస వచ్చినవారికే ప్రాధాన్యత లభిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇళ్ల కోసం గతంతో పోలిస్తే భారీగా వెచ్చించాల్సి వస్తోందని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో ఇటీవల కెనడా వలసలపై ఆంక్షలు విధించింది. విదేశీ విద్య కోసం విద్యార్థులకు వీసా ఫీజులను పెంచింది. అంతేకాకుండా వారి బ్యాంకు ఖాతాల్లో కనీసం ఉండాల్సిన ఆర్థిక నిల్వలను కూడా భారీగా పెంచింది. అలాగే వలసలను తగ్గించడమే లక్ష్యంగా కొత్త ఇమ్మిగ్రేషన్ పాలసీని తీసుకొచ్చింది. దీంతో కెనడాలో ఉంటున్న వివిధ దేశాల ప్రజలకు, విద్యార్థులకు కొత్త కష్టం వచ్చిపడింది. ముఖ్యంగా కెనడాలో ఉంటున్న విదేశీయుల్లో అత్యధికం భారతీయులే. అలాగే అక్కడ విద్యనభ్యసిస్తున్న వారిలో భారత విద్యార్థులే ఎక్కువ మంది ఉన్నారు. వీరంతా ఇప్పుడు ఆ దేశాన్ని వీడాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. శాశ్వత పౌరసత్వం లభించని వారు, విద్య, ఉద్యోగాల కోసం వచ్చి తమ వీసా గడువు ముగిసినవారు కెనడాను విడిచిపెట్టాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో భారతీయ విద్యార్థులు నిరసనకు దిగారు. కెనడా కొత్త ఇమ్మిగ్రేషన్ పాలసీ తమ అవకాశాలను దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా తీసుకొచ్చిన నిబంధనల ప్రకారం.. భారతీయ విద్యార్థులు వర్క్ పర్మిట్ పొందడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. అంతేకాకుండా శాశ్వత నివాసం పొందడానికి మరింత కష్టపడాల్సి వస్తోంది. కెనడా భారీగా వచ్చిన వలసలతో ప్రస్తుతం అధిక జనాభా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. వలసల వల్లే ఈ పరిస్థితి సంభవించిందని ఆ దేశ గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ వలసలు ఆరోగ్య రంగం, గృహనిర్మాణం వంటి ప్రభుత్వ రంగాలను దెబ్బతీసింది. దీంతో ఇమ్మిగ్రేషన్ విధానంలో మార్పులు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. అయితే.. చాలా మంది విద్యార్థులు విదేశాలకు వెళ్లి అక్కడ ఉద్యోగం సంపాదించడానికి, చదువుకోవడానికి రుణాలు తీసుకుంటారు. అందువల్ల, వారు గ్రాడ్యుయేషన్ అయిన వెంటనే తిరిగి భారతదేశానికి వెళ్లిపోవాల్సి వస్తే వారి నెత్తిన భారీగా అప్పుల భారం పడుతుంది. అందుకే ఇప్పటికే కెనడాలో చదువుతున్న వారికి కొత్త ఇమ్మిగ్రేషన్ విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని భారతీయ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే శాశ్వత పౌరసత్వం పొందడానికి ప్రభుత్వం అవకాశాలు కల్పించాలని, ఇతర ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

# పెరటి కోళ్ల పెంపకంతో అధిక లాభాలు

## ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్





**ఉట్నూర్ సెప్టెంబర్ 19(ప్రభాత సమాచారం)**
గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు,నిరుద్యోగులకు పెరటి కోళ్ల పెంపకంతో ఉపాధితో పాటు ఆదాయం లభిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు.గురువారం ఉట్నూరు మండలంలోని కల్లూరుగూడ గ్రామంలో భావ్యపమం కోళ్ల పరిశోధన సంచనాలయము హైదరాబాద్ వారిచే 360 పెరటి కోళ్లు,100 ఇనుపతో తయారు చేసిన కోళ్ల షెడ్లు పంపిణీ చేశారు.ముందుగా సంస్థ శాస్త్రవేత్తలు పెరటి కోళ్ల పెంపకం పై, వాటి పెంపకం వల్ల కలిగే లాభాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.పెరటి కోళ్లను పెంపకంతో అధిక లాభాలు ఉంటాయని పేర్కొన్నారు.ఈ కోళ్లు అధిక బరువు కలిగి ఉంటాయని దాంతో పాటు అధిక మాంసం, గుడ్లనిస్తాయన్నారు.స్వయం ఉపాధి పొందేందుకు సర్కార్ వారు పెరటి కోళ్ల పెంపకంలో శిక్షణ ఇస్తారని,ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని చేసుకోవాలన్నారు. అరటి కోళ్ల పెంపకంతో అధిక నికర ఆదాయం వస్తుందని తెలిపారు.ఇందులో వానరాజా,రాజశ్రీ, శ్రీనిధి ఇలా పలు రకాల కోళ్లు ఉంటాయని పేర్కొన్నారు.నాటు కోళ్లతో పోల్చితే పెరటి కోళ్లు అతి తక్కువ రోజులో పెరుగుతాయన్నారు. నిరుద్యోగ యువత,రైతులు పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి సారించి, స్వయం ఉపాధి పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బ ప్రిన్సిపల్ సైంటిస్టు,డా.బి.ప్రకాష్ డా.రాజకుమార్, డా.విజయ్ కుమార్, టెక్నికల్ ఆఫీసర్ ఎస్కే బాంజా,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ భార్గవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రవ్నీత్ సింగ్ బిట్టు తల తెచ్చిన వారికీ నా ఆస్తి రాసిస్తా..!!

## ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సంచలన వ్యాఖ్యలు





**ఉట్నూర్ సెప్టెంబర్ 19(ప్రభాత సమాచారం)**
కేంద్రంలో గాడ్సే ప్రభుత్వం ఉందని, కుల మతాల మధ్య చిచ్చు పెట్టి దేశంలో అల్లకల్లోలం సృష్టించడానికి బీజేపీ పార్టీ నిరంతరం కుట్ర పన్నుతోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం టీపిసిసి రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో కేంద్ర మంత్రి రవ్నీత్ సింగ్ బిట్టు దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ సంచలన వ్యాఖ్యలు చేసారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తల తెచ్చిన వారికీ రివార్డు ఇస్తాం అని కేంద్రమంత్రి రావ్నీత్ సింగ్ బిట్టు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ..ఎమ్మెల్యే కౌంటర్ ఇస్తూ.. రవ్నీత్ బిట్టు తలను తీసుకొచ్చిన వారికి తన ఆస్తి, తన తండ్రి పేర ఉన్న ఆస్తిని బహుమానంగా ఇస్తానని అన్నారు. కేంద్ర మంత్రి బిట్టు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బీజేపీ పార్టీ గుండాలను పోషిస్తుందని అన్నారు. కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా ఇప్పటివరకు స్పందించకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ త్యాగాల కుటుంబ నుండి వచ్చిన ప్రజల నాయకుడని అన్నారు. బీజేపీ పార్టీ రవ్నీత్ బిట్టుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం బురద జెల్లుతుందని,10 సంవత్సరాలు అధికారంలో ఉండి రాష్ట్రానికి ఎం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, సీఎం రేవంత్ రెడ్డిపై విచ్చల విడిగా మాట్లాడుతూ నోరు పారేసుకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ట్విట్టర్ పిట్ట కేటీఆర్ విదేశాల్లో ఉంటు ప్రభుత్వంను బద్నామ్ చేయడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల కోసం పని చేస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జి ఆత్రం సుగుణ,కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి,పిఏసిఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి,మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుం,ఇంద్రవెల్లి మండల అధ్యక్షుడు ముఖాడే ఉత్తం,బ్లాక్ అధ్యక్షులు ఇక్బాల్,ఎస్సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దూట రాజేశ్వర్,ఎస్సి సెల్ మండల అధ్యక్షుడు అచ్చదేవానందం,టీపిసిసి సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ మోబిన్,మాజీ సర్పంచ్ లు ఆత్రం రాహుల్, పెందుర్ కళావతి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బిరుదుల లాజర్, సయ్యద్ నిసార్,తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం.. జిల్లా కలెక్టర్ రాజర్షి షా

## చిన్నారికి అన్నప్రాసన చేసిన జిల్లా కలెక్టర్

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్









**నేరెడిగొండ సెప్టెంబర్ 19(ప్రభాత సమాచారం)**
మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ పోషణ మాసంలో భాగంగా నెరడిగొండ మండలం చించోలి లో ఏర్పాటు చేసిన అన్నప్రాసన, సీమంతం కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారికి అన్నప్రాసన చేశారు.మహిళలు బాగుంటేనే దేశం బాగుంటుందని, పోషకాహారం తోనే ఆరోగ్య సమాజం నిర్మితమవుతుందని ఆన్నారు.గర్భిణీ స్త్రీలు, బాలింతలు , చిన్నారులు రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని కోరారు.అలాగే తినేముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, పరిశుభ్రత పాటించాలని ఆన్నారు. చిన్నారులకు మొదటి బడి అంగన్వాడీ కేంద్రాలే కనుక వారికి క్రమశిక్షణ, పరిశుభ్రత, మంచి నడవడిక నేర్పించాలని ఆన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారంతో పాటుతగిన వైద్య పరీక్షలు చేసుకోవాలని అవసరమైన చికిత్సలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటారు.అంతకుముందు సాంప్రదాయ పద్ధతిలో జిల్లా పాలనాధికారిని స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కలిమ్, ఎసిడి పివో మిల్కా, ఎంపిడిఒ, సూపర్వైజర్, ఎంపిఒ అంగన్వాడి టీచర్, తదితరులు పాల్గోన్నారు.

## మున్సిపల్ కార్మికుడి కుటుంబాని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్



**కాగజ్ నగర్ సెప్టెంబర్ 19( ప్రభాత సమాచారం)**
గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ప్రమాద శాతం మరణించిన మున్సిపల్ కార్మికుడు నగేష్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ ఇంచార్జ్ రావి శ్రీనివాస్ పరామర్శించారు . రావి శ్రీనివాస్ మాట్లాడుతూ కుటుంబానికి అన్యాయం జరగకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి కుటుంబానికి వెంటనే రూ.5 లక్షలు రూపాయలు ఎక్స్గ్రేషియా, డబల్ బెడ్ రూమ్ ఇల్లు , కుటుంబంలో ఒకరికి మున్సిపాలిటీలో ఉద్యోగం ఇచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలా అడిషనల్ కలెక్టర్ , మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దలా దేవయ్య ,మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిరి , కౌన్సిలర్లు, పట్టణ నాయకులు ఉన్నారు.

# చెప్పేవారే లేరు..!

మెదక్ : పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో బోధనకు ఆటంకం ఏర్పడుతోంది. బదిలీలు, పదోన్నతులు ముగిసిన తర్వాత ఖాళీలు పెరిగాయి. ఖాళీగా ఉన్న స్థానాల్లో విద్యా వాలంటీర్లను నియమించేవారు. ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభమై మూడో నెలలైనా నియామకాలపై ఎలాంటి స్పష్టత లేదు. ఖాళీలు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో వాలంటీర్లను నియమించుకోవాలని ఇటీవల పాఠశాల విద్యాశాఖ కమిషనర్ మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. అధికారికంగా ఆదేశాలు రాకపోవడంతో అధికారులు వెనకడుగు వేస్తున్నారు. జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై పరిశీలన కథనం...

655 పోస్టులు ఖాళీలు...

జిల్లాలోని 897 ప్రభుత్వ పాఠశాలల్లో 4,021 పోస్టులు మంజూరయ్యాయి. ఇటీవల ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టింది. దీంతో జిల్లాలో ఇంకా 655 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టేక్మాల్ మండలంలో 84, మెదక్‌లో 74, పెద్దశంకరంపేటలో 70, అల్లాదుర్గంలో 66, రేగోడ్‌లో 66, పాపన్నపేట మండలంలో 51 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 183 ఉన్నాయి. అయిదు తరగతులకు ఒక్కరే బోధించాల్సి రావడంతో పిల్లలు చదువులో వెనకబడుతున్నారు.

పిల్లలు రాక, గురువు లేక..

విద్యార్థులు లేక ఒకటి, ఉపాధ్యాయుడు లేక మరో బడి మూతపడింది. అల్లాదుర్గంలోని కాన్సిరాం నగర్ ప్రాథమిక పాఠశాలను ప్రైవేటుకు దీటుగా అభివృద్ధి చేశారు. కానీ విద్యార్థులు లేక జూన్‌లో మూతపడింది. పల్లెగడ్డ (కుసంబీ నగర్) ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు చదువుతున్నారు. జులైలో ఉపాధ్యాయుడికి



పదోన్నతి రావడంతో వెళ్లిపోయారు. దీంతో మూడు కిలోమీటర్లు నడిచి చిల్వేర్‌లోని ప్రాథమిక పాఠశాలకు వెళ్తున్నారు.

మూతపడి..రేగోడ్ మండలం రంజ్యానాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో నలుగురు విద్యార్థులున్నారు. బదిలీలపై వచ్చిన ఉపాధ్యాయురాలు స్వల్ప కాలంలోనే డిప్యుటేషన్‌పై హైదరాబాద్ ప్రాంతానికి వెళ్లడంతో పాఠశాల మూతపడింది. విద్యార్థులు కిలోమీటరు దూరంలో ఉన్న బురాన్‌వాడీ తండా బడికి వెళ్తున్నారు.

రోజుకో టీచరు..

పాపన్నపేట మండల పరిధిలోని మధిర కొత్తపల్లి, సోమ్లా తండా ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఏర్పడ్డాయి. మధిర కొత్తపల్లిలో 20మంది, సోమ్లా తండాలో 23మంది విద్యార్థులున్నారు. మూడు నెలలుగా ఉపాధ్యాయులు లేరు. దీంతో అధికారులు ప్రత్యామ్నాయంగా వేరే పాఠశాలల ఉపాధ్యాయులను అక్కడికి పంపుతున్నారు. ఉపాధ్యాయులు రాకుంటే విద్యార్థులు ఆటలాడుతుంటారు. రోజుకో కొత్త ఉపాధ్యాయుడు రావడంతో పాఠాలు అర్థంకావడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిలప్‌చెడ్: మండల పరిధిలోని ఫైజాబాద్ గ్రామపంచాయతీ శేరికుంటతండా పాఠశాలలో గత కొన్ని నెలలుగా ఉపాధ్యాయులు లేకపోవడంతో డిప్యూటేషన్‌పై ఫైజాబాద్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు విధులు నిర్వహించారు. ఆమె బదిలీపై వెళ్లిపోవడంతో మండలంలోని ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు రోజుకొకరు విధులు నిర్వహిస్తున్నారు.

మూడు తండాల విద్యార్థులు..

నర్సాపూర్ రూరల్: మండలంలోని అహ్మద్‌నగర్ పంచాయతీ పరిధిలోని నాగోనిగుంట, పిల్లిగుండు, జువ్విపోచమ్మ తండాలకు కలిపి పిల్లిగుండు తండాను పంచాయతీగా చేశారు. మూడు తండాల్లోని పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో అహ్మద్‌నగర్ పాఠశాలలో కలపడంతో, మూడు తండాల విద్యార్థులు అక్కడికే వెళుతున్నారు. ఇక్కడి ఉపాధ్యాయులకు బదిలీ అయినా కొత్తవారు రాకపోవడంతో అక్కడే పనిచేస్తున్నారు.

సర్దుబాటుతో బోధన

రాధాకిషన్, జిల్లా విద్యాధికారి

జిల్లాలో ఖాళీ ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. తాత్కాలికంగా విద్యావాలంటీర్ల నియామకంతో పాటు ప్రభుత్వం ఉపాధ్యాయులు లేని చోట సర్దుబాటు చేసి బోధనను కొనసాగిస్తున్నాం. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

# జలం.. రైతన్నకు బలం

సంగారెడ్డి : భారీ వర్షాలతో నీటి వనరులు జలకళ సంతరించుకున్నాయి. వాగులు, వంకలు, ప్రాజెక్టులు పొంగిపొర్లాయి. యాసంగి పంటల సాగుకు, తాగేందుకు ఇబ్బందులుండవని రైతులు పేర్కొంటున్నారు.సింగూరు జలాశయం: ఈ వానాకాలంలో సింగూర్ ప్రాజెక్టు పరిధిలో 40 వేల ఎకరాలు సాగు కావాల్సి ఉండగా, 15వేలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీనికి ప్రధాన కారణం వర్ష ప్రభావమే. తాగేందుకు ఇబ్బందులు వస్తాయని మొదట సాగుకు నీటిని విడుదల చేయలేదు. దీంతో రైతులు వరి సాగు చేయలేదు. యాసంగిలో వరి సాగు చేసుకోవచ్చని, ఆరుతడి పంటలకు ఇబ్బందులు ఉండవని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు.

మంజీర ప్రాజెక్టు..: సంగారెడ్డి మండలం కల్పగూర్ శివారు మంజీర ప్రాజెక్టు సామర్థ్యం 1.50 టీఎంసీలు. ప్రస్తుతం 1.40 టీఎంసీలున్నాయి. ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 1800 క్యూసెక్కుల నీటి విడుదలతోపాటు పై నుంచి అదే స్థాయిలో వరద వస్తోందని ప్రాజెక్టు డిప్యూటీ జనరల్ మేనేజర్ అజీజ్ చెప్పారు.

యాసంగిలో సాగుకు‘ సై’: ఇటీవల కురిసిన వర్షాలకు చేతికి వచ్చిన పెసర, మినుము, సోయాబీన్, పత్తి, కందికి కొంత నష్ట వాటిల్లింది. దిగుబడులపై ప్రభావం పడే అవకాశం ఉందని అన్నదాతల్లో కలవరం మొదలయింది. యాసంగిలో వరితోపాటు ఆరుతడి పంటలు సాగు చేసుకోచ్చవని అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి.


పంటలపై రైతులకు అవగాహన

– కె.శివప్రసాద్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి.

ఇటీవల కురిసిన వర్షాలకు పంటలకు కొంత నష్టం జరిగింది. యాసంగిలో అదే స్థాయిలో పంటల సాగుకు అనుకూలం. వచ్చే అక్టోబరు నుంచి యాసంగి ప్రారంభం కానుంది. ఇప్పటి నుంచి సాగుకు సిద్ధంగా ఉంటే ఎంతో మేలు. నీటి వనరులు, ప్రాజెక్టుల్లో నీటి సమృద్ధిగా ఉంది. భూగర్భ జలాల సమస్య లేదు. వరి, ఆరుతడి పంటల సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

# పంట రుణాలపై మల్లగుల్లాలు

సిరిసిల్ల: వానాకాలం సీజన్ ముగియడానికి వస్తున్నా.. పంట రుణాలివ్వడంలో అధికారులు రైతులను బ్యాంకుల చుట్టూ తిప్పించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో రూ.4720.53 కోట్ల రుణాలను బ్యాంకర్లు లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటివరకు 40 శాతం కూడా పంపిణీ చేయలేదు. రూ.1887.98 కోట్లు మాత్రమే రైతులకు ఇచ్చారు. ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియను గత జులై నుంచి మూడు విడతలుగా ఆగస్టు వరకు అమలు చేసింది. మాఫీ అయినవారు కొత్తగా రుణాలు తీసుకునేందుకు ఇప్పుడిప్పుడే బ్యాంకులకు వస్తున్నారు. ప్రతి మూడు నెలలకోసారి బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించి.. తమ పరిధిలోని లక్ష్యం చేరుకోవాలని ఉన్నతాధికారులు అదేశిస్తుంటారు. అయితే రెండు నెలలుగా రుణమాఫీ ప్రక్రియతోనే గడిచిపోవడంతో లక్ష్యంపై దృష్టి




సారించలేదు.

అర్హత ఉన్నా మాఫీ కాలే..ఉమ్మడి జిల్లాలో రుణమాఫీ అర్హత ఉండి పొందని రైతుల వివరాల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. దీనికోసం వ్యవసాయశాఖ గ్రామాలవారీగా ఆధార్, రేషన్ కార్డు, ఇంటి పేరులో దొర్లిన తప్పులు తదితర వివరాలను సేకరిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు వ్యవసాయశాఖ సేకరించిన వివరాల ప్రకారం 17,749 మందికి మాఫీ కాలేదు. సర్వే ప్రక్రియ పూర్తయ్యేసరికి మరింతమంది అర్హులు పెరిగే అవకాశం ఉంది. వీరే కాకుండా ఉమ్మడి జిల్లాలో రెండు బ్యాంకుల్లో రుణాలు పొందిన రైతుల వివరాలను ప్రభుత్వానికి పంపడంలో జరిగిన పొరపాటుతో అర్హత ఉన్నవారికి మాఫీ కాలేదు. ఈ సీజన్‌లో రుణమాఫీ కారణంగా పంట రుణాల పంపిణీలో కాస్త ఆలస్యమైందని లీడ్ బ్యాంక్ రాజన్న సిరిసిల్ల జిల్లా మేనేజర్ మల్లికార్జున్ చెప్పారు. ప్రతి సీజన్‌లో అన్ని బ్యాంకులు 90శాతం లక్ష్యం చేరుకునేలా సమావేశంలో సూచించామని, అలాగే రుణమాఫీకి సంబంధించి బ్యాంకుల్లో తప్పులు దొర్లినవారి వివరాలను సరి చేస్తున్నామన్నారు.

# పంచాయతీ ఓటర్లలో మహిళలే అధికం

కరీంనగర్ : పంచాయతీ ఎన్నికల కోసం రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలిస్తే మహిళలే అధికంగా ఉన్నారు. రాబోయే ఎన్నికల్లో గెలుపోటములను వారే శాసించే అవకాశముంది. జిల్లా పంచాయతీ అధికారులు ఓటర్ల జాబితాను శుక్రవారం ప్రకటించారు. శనివారం నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. ప్రకటించిన జాబితాలో అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయొచ్చని అధికారులు పేర్కొన్నారు. జాబితాలను జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గోడలపై అతికించారు.

15 మండలాల్లో ఎక్కువ..

జిల్లాలో 15 మండలాల పరిధిలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. దాదాపు 12 వేల పైచిలుకు ఎక్కువగా ఉండటం విశేషం. జిల్లాలో 323 గ్రామ పంచాయతీల్లో 5,30,711 మంది ఓటర్లున్నారు. వీరిలో 2,71,680 మంది మహిళలు, 2,59,021 మంది పురుషులు ఉన్నారు. 21 వరకు అభ్యంతరాల స్వీకరణ..ఈనెల 21 వరకు అన్ని గ్రామపంచా యతీల పరిధిలో కార్యదర్శులు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అభ్యంతరా లను సహాయ ఎన్నికల అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పరిశీలించి మండల స్థాయిలో పరిష్కరిస్తారు. అనంతరం జిల్లా స్థాయిలో పరిశీలించి, సవరణలు పూర్తయిన తర్వాత తుది జాబితాను ఈనెల 28న విడుదల చేస్తారు. ఒక వార్డులో ఉండాల్సిన ఓటర్లు మరో వార్డులో ఉండటం, ఓటర్ల పేర్ల విషయంలో తప్పులు జరగడం తదితర అభ్యంతరాలు ఉన్నాయి. నగర, పురపాలక ఎన్నికల్లో అక్కడ ఓట్లు నమోదు చేసుకొని అక్కడే ఓట్లు వేసి.. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో అక్కడ పేర్లను తొలగించుకొని పంచాయతీలో పేర్లు నమోదు చేసుకొని ఓటు వేసేందుకు వచ్చేవారి వైఖరిని కొందరు వ్యతిరేకిస్తున్నారు.

## జింకల పార్కు వద్ద కాలుష్యాన్ని నియంత్రించండి

హైదరాబాద్: ఆటోనగర్ నుంచి వస్తున్న పారిశ్రామిక వ్యర్థాలతో వనస్థలిపురంలోని జింకల పార్కుకు కాలుష్యం ముప్పు పెరిగిన నేపథ్యంలో నియంత్రణ చర్యలు చేపట్టాలంటూ పీసీబీ జీహెచ్ఎంసీకి మార్గదర్శకాలు జారీ చేసింది. ఎకరాల్లో వ్యర్థాలు పోగైన నేపథ్యంలో బయోమైనింగ్ చేపట్టాలని, జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించింది. ఆటోనగర్ ఎస్టీపీ నుంచి మూసీ వైపు చేపట్టిన 1.5 కి.మీ. పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తిచేయాలంది.

రెండేళ్లుగా సమస్య.. దాదాపు 15 ఎకరాల్లో విస్తరించిన హరిణ వనస్థలి పార్కులో పదుల సంఖ్యలో జలాశయాలున్నాయి. పక్కనే ఉండే ఆటోనగర్ డ్రైనేజీతో భారీగా రసాయన మిశ్రమాలు పార్కులోకి చేరడంతో పరిసరాలు కాలుష్య కాసారంగా మారుతున్నాయని రెండేళ్లుగా స్వచ్ఛంద సంస్థలు పోరాడుతున్నాయి. ఆటోనగర్ పారిశ్రామిక వాడలో వందలాది బ్యాటరీ దుకాణాలు, వాటర్ సర్వీసింగ్ కేంద్రాలు, ఇంజినీరింగ్, ఫ్యాబ్రికేషన్ యూనిట్లు, గోడౌన్లు ఉన్నాయి. ఇక్కడినుంచి వెలువడే రసాయన వ్యర్థాలను తరలించే వ్యవస్థ లేక ఆ నీరంతా అటవీ భూముల్లోకి డంప్ చేస్తున్నారు. దీంతో 1.5 కి.మీ. పరిధిలో నివసించేవారిపై ప్రభావం పడుతోందని ఆందోళనలు చేపట్టారు. అనంతరం ఇక్కడ 100 కేఎల్‌డీ సామర్థ్యంతో ఎస్టీపీని నిర్మించారు. 500 కేఎల్‌డీల వ్యర్థాలు వస్తుండటంతో పరిస్థితి అదుపు తప్పింది. అక్కడి సంస్థలు మళ్లీ ఆందోళనలు చేయడం, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎస్టీపీ నుంచి శుద్ధిచేసిన నీటిని మూసీకి తరలించే పనులను జీహెచ్ఎంసీ చేపట్టింది. అవి కొలిక్కి రాకపోవడంతో పీసీబీ అధికారులు వనస్థలి పార్కు పరిసరాలను పరిశీలించి నివేదిక సమర్పించారు. టాస్క్‌ఫోర్స్ సమావేశంలో చర్చించిన అనంతరం పీసీబీ మార్గదర్శకాలు జారీ చేసింది.

# అర్ధాంతరం.. రహదారులు ఆగమాగం



ధర్మపురి: పట్టణంలో పలు రహదారి నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం కొన్ని ప్రారంభించి వదిలేయగా.. మిగతా పనులు శంకుస్థాపనకు సైతం నోచుకోలేదు. నిధులు విడుదల కాకపోవడంతో పనులన్నీ పెండింగులోనే ఉన్నాయి.

15 శాతమే పూర్తి..ఎన్‌హెచ్63 నుంచి ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా వెళ్లే రహదారిపై వేలాది భక్తుల వాహనాలు గోదావరికి వస్తుంటాయి. ఈ రోడ్డు అధ్వానంగా మారగా.. గతంలో దీనిని సీసీగా మార్చేందుకు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ రహదారిని ప్రారంభించి ఇరువైపులా వెడల్పు చేసి వదిలేశారు. కేవలం 15శాతం పనులే పూర్తయ్యాయి. ప్రస్తుతం ఈ రోడ్డు పక్కన ఎలాంటి మట్టి పోయకపోవడంతో ప్రమాదకరంగా మారింది.

ఎన్నికల కోడ్ రావడంతో..పురపాలిక పరిధిలోని తెనుగువాడ నుంచి బ్రాహ్మణసంఘం వరకు రెండు వరుసల రహదారి నిర్మాణానికి రూ.1.30కోట్ల నిధులతో పనులు చేపట్టారు. 280 మీటర్ల వరకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణాలను దాదాపుగా పూర్తిచేశారు. కేవలం 20 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. మిగతావి చేపట్టే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయాయి.

కంకర తేలి.. ప్రమాదరకరంగా మారి

అంబేద్కర్ కూడలి నుంచి అక్కపల్లి ఆలయం వరకు రహదారి నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసింది. రహదారిని వెడల్పు చేయడంతోపాటు రెండు చోట్ల కల్వర్టుల నిర్మాణాలు పూర్తి చేశారు. ఈ రోడ్డుకు సంబంధించి 30శాతం పనులు పూర్తిచేసి నిలిపివేశారు. రహదారి వెడల్పుతోపాటు, సెంట్రల్ లైటింగ్ పనులు కూడా ప్రతిపాదించారు. నిధులు విడుదల కాకపోవడంతో ఎనిమిది నెలలుగా పనులు నిలిచిపోవడంతో కంకర తేలి ప్రమాదకరంగా మారింది.

రూ.6 కోట్లు విడుదల చేసినా..

జాతీయ రహదారి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నాలుగు వరుసల రహదారిని ఏర్పాటుచేసి మధ్యలో సెంట్రల్ లైటింగు పనులు చేపట్టేందుకు గత ప్రభుత్వం రూ.6 కోట్ల నిధులు విడుదల చేసింది. అయితే రహదారిని వెడల్పు చేసి ఓ వైపు కంకర పోసి నిలిపివేశారు. 30శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. నిధులు కేటాయించి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

నిధులు మంజూరు కాగానే నిలిచిన రహదారి నిర్మాణ పనులు చేపడతాం. ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదలు పంపించాం. అనుమతులు రాగానే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

గంగాధర్, పుర కమిషనర్, ధర్మపురి

# ఆదిలోనే అవస్థలు



తాండూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సంవత్సరానికి రెండు జతల ఏకరూప దుస్తులు అందజేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. చిన్నచిన్న పొరపాట్లతో ఆశయం పూర్తిస్థాయి అమలుకు నోచుకోవడం లేదు. ఏకరూప దుస్తులు ఇచ్చినప్పటికీ కుట్టేముందు ఆది కొలతలు సరిగా తీసుకోకపోవడం, కుట్టు గట్టిగా వేయకపోవడంతో సరిపోక పోవడం, చిరిగి పోవడం తదితర లోపాల వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతూ ధరించాల్సి వస్తోంది. దీనికి సంబంధించి 'పరిశీలన' కథనం.. ఏకకాల కత్తిరింపుతోనే సమస్యలు

జిల్లాలోని 19 మండలాల పరిధిలో 2022-23 సంవత్సరానికి సుమారు 1.15లక్షల మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. గతంలో విద్యార్థికే వస్త్రం ఇచ్చి నిర్ణయించిన కుట్టుకూలీ ధర అందజేసేవారు. కొన్నేళ్లుగా మహిళా సంఘాలకు దుస్తులు కుట్టే బాధ్యత అప్పగిస్తున్నారు. వారు ఎలాంటి కొలతల్లేకుండా తరగతుల వారీగా సైజ్‌ను పెంచి కత్తిరించి మహిళా సంఘాల చేత కుట్టించారు. విద్యార్థులు కొందరు ఎత్తులో చిన్నగా పెద్దగా ఉండడం, కొందర బక్కపలచగా, లావుగా ఉండడంతో దుస్తులు కొందరికి సరిపోతున్నా, మరికొందరి శరీర ఆకృతికి భిన్నంగా ఉంటున్నాయి.

గతేడాది నుంచి తరగతుల వారీగా నిర్ణయించిన డిజైన్ బాగుంది. ఈసారి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఏకరూప దుస్తుల డిజైన్ చేసిన విషయం తెలిసిందే. 1-3తరగతులకు, 4-5 వరకు, 6-12 వరకు బాలికలకు విడి రకాలుగా, 1-12 తరగతుల బాలురకు కొలతల ఆధారంగా, వయసుల వారీగా కుట్టాల్సి ఉంటుంది.

అన్ని ధరలూ పెరిగాయి..

జత ఏకరూప దుస్తులకు కూలీ కింద రూ.100 ఇచ్చారు. ఏం సరిపోతాయి. ముడి సరకులు ధరలన్నీ పెరిగాయి. అయినా కూడా చక్కగా కుట్టాం. అందరికీ ఒకే సైజ్‌లో కత్తిరింపుతో ఇబ్బంది వచ్చింది. ప్రైవేటు దుస్తులు కుట్టే విధంగానే కుట్టారు. కూలీ ధర పెంచితే న్యాయం జరుగుతుంది.

లక్ష్మి, మహిళా సంఘం సభ్యురాలు.

కూలీ సరిపోకపోవడంతోనే..

రెండు జతలకు రూ.100 ఇస్తే ఏం సరిపోతాయని కుట్టిన మహిళా దర్జీలు వాపోయారు. కనీసం రూ.200 చెల్లించాలని కోరుతున్నారు. పాఠశాల ప్రారంభం నాటికి విద్యార్థులకు ఒక జత ఏకరూప దుస్తులు ఆదరాబాదరాగా పంపిణీ చేశారు. మరోజత ఇటీవలే ఇచ్చారు. కుట్టే విధానం, ఇచ్చే ధరకు చాలా వ్యత్యాసం ఉందని, ఇలాగే జత ప్రైవేటుగా దుస్తులను కుడితే సుమారు రూ.400 తీసుకుంటారని తెలిపారు.

మొత్తం పాఠశాలలు..1,325

విద్యార్థులు.. 1,22,728


ఏకరూప దుస్తుల కేటాయింపు.. 1.15 లక్షలు

వీరిలో బాలికలు.. 54,730

బాలురు.. 53,058

# ప్రచారం దండి.. ఆదాయానికి గండి

హైదరాబాద్: నగరంలో అక్రమ హోర్డింగులు పెరుగుతున్నాయి. బంజారాహిల్స్, హైటెక్ సిటీలోని కొన్ని ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా ప్రధాన రహదారులపై వెలుస్తున్నాయి. జీహెచ్ఎంసీ ఆదాయానికి గండి పడుతోంది. ప్రైవేటు వ్యక్తులు రూ.కోట్లు సంపాదిస్తున్నారు. ఏళ్లుగా అక్రమ దందా.. గత సర్కారు జీ.వో 68 ద్వారా ఐదేళ్ల కిందట నూతన ప్రకటనల విధానాన్ని తీసుకొచ్చింది. దాని ప్రకారం హోర్డింగులు, నామ ఫలకలు, బోర్డులు భూమి నుంచి 15 అడుగుల ఎత్తులోపే ఉండాలి. అంతకన్నా ఎత్తుంటే వాటిని జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తొలగించేది. వెయ్యికిపైగా ఎత్తైన హోర్డింగులను అధికారులు తీసేశారు. ఈ క్రమంలో పలువురు నేతలు అక్రమ హోర్డింగులను ఏర్పాటు చేసుకున్నారు. వాటిని నెలవారీ స్థిర ఆదాయానికి వాడుకుంటున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నం.3, ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్, కేబీఆర్‌పార్కు రోడ్డు, సైబర్‌టవర్స్ కూడలి పైవంతెన, బయోడైవర్సిటీ కూడలి పైవంతెన, తెలుగుతల్లి కూడలి పైవంతెనలపై ఉన్న అక్రమ హోర్డింగులే అందుకు నిదర్శనం. పట్టించుకోని హైడ్రా.. అనేక కూడళ్లలో అనుమతిలేని ట్రాఫిక్ అంబ్రెల్లా ప్రకటన బోర్డులు చలామణి అవుతున్నాయి. వాటితో కొన్ని ఏజెన్సీలు ఏళ్లుగా దందా చేస్తున్నాయి. గత ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల మాదిరే..



ప్రస్తుత హైడ్రా సంస్థ కూడా పట్టించుకోవట్లేదు.

త్వరలో నూతన విధానం.. గుర్తించిన 150 ప్రాంతాల్లో 15 అడుగులకు మించి ఎత్తుండే ఎల్‌ఈడీ హోర్డింగులను ఏర్పాటు చేసుకునేందుకు త్వరలోనే ప్రభుత్వం అనుమతి ఇవ్వనుందని అధికారులు చెబుతున్నారు. జీవో నం.68లోని పలు నిబంధనలను సవరించనున్నట్లు అంచనా. ఒక్క సంస్థకే ప్రయోజనం టెండరు కాలపరిమితి పూర్తయ్యాక కూడా ఓ ప్రైవేటు ఏజెన్సీ బంజారాహిల్స్ రోడ్డు నం.3లో ముఫకంజా కాలేజీ, ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వద్దనున్న ఎఫ్ఓబీలపై ప్రకటనలను ఏర్పాటు చేస్తోంది. అధికారులను వివరణ కోరితే.. సదరు సంస్థకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక మినహాయింపు వచ్చిందని, ప్రయోగాత్మకంగా ఎల్ఈడీ హోర్డింగులు ఎలా ఉంటాయనేది పరిశీలించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనిపై విమర్శలొస్తున్నాయి.

# అవుటర్ వంతెన పైనుంచి పడిన లారీ

హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్డుపై అదుపుతప్పిన లారీ వంతెనపై నుంచి సర్వీసు రోడ్డు మీద పడిన ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా, క్లీనర్ తీవ్రగాయాలయ్యాయి. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోతెల్లవారు జామున 4 గంటలకు జరిగిన ఈ దుర్ఘటనకు సంబంధించి పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయిజిల్లా (పూర్వ అనంతపూర్) హిందూపూర్ మోడల్ కాలనీకి చెందిన డ్రైవర్ రాజగోపాల్‌చారి (28), అదే ప్రాంతానికి చెందిన క్లీనర్ బాబాజాన్ లారీలో ఐరన్ లోడ్‌తో రాయ్‌పూర్ నుంచి బెంగుళూర్‌కు బయలుదేరారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా బెంగళూర్ వెళ్తుండగా.. తారామతిపేట్ ప్రాంతంలో లారీ అదుపుతప్పింది. ఔటర్ రింగ్‌రోడ్డు వంతెన మీదుగా ఫల్టీకొట్టి కింద సర్వీస్ రోడ్డుపై పడింది. లారీ క్యాబిన్‌లో ఇరుక్కుని తీవ్ర గాయాలతో



డ్రైవర్ రాజగోపాల్‌చారి అక్కడికక్కడే మృతిచెందాడు. క్లీనర్ బాబాజాన్ (30) తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాబాజాన్‌ను హుటాహుటిన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన రాజగోపాల్‌చారి మృతదేహాన్ని వెలికి తీసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. తెల్లవారుజాము వేళ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా లారీ అదుపుతప్పడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

# పోరాటాల ఖిల్లా.. పులిగిల్ల

వలిగొండ : తెలంగాణ సాయుధ పోరాటంలో యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పులిగిల్ల గ్రామం పోరాటాల ఖిల్లాగా పేరు గాంచింది. హైదరాబాద్ సంస్థానం పరిధిలో గ్రామం ఉండేది. అప్పటి జాగీర్దార్ సయ్యద్ హైదర్ అలీఖాన్ బహదూర్ ఈ ప్రాంతాన్ని పాలించారు. భూముల కౌలు, భూ విక్రయాల విషయంలో తలెత్తిన వివాదంతో రైతులు, కూలీలు జాగీర్దార్ విధానాలు వ్యతిరేకించి భూపోరాటానికి సిద్ధమయ్యారు. కొమ్మిడి సత్తిరెడ్డి, వాకిటి పెద్ద పుల్లారెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రమహాసభ కమ్యునిస్టులను ఆశ్రయించి సంఘంగా ఏర్పడారు. నాటి జాగీర్దార్ ప్రతినిధులుగా ఉన్న పట్వారి కొలను బుచ్చిరెడ్డి, గుమస్తా సాతాను రంగయ్యలు నిజాం పోలీసులతో పాటు, రజాకార్ల నాయకులు అబ్బాస్ అలీ, ఖాసీమ్ రజావలి, ముస్త్యాలపల్లి చోటేమియా, గడ్డం అమీన్‌ల బలగాలతో గ్రామస్థులపై 1946 నవంబర్ 29న దాడులు జరిపారు. గ్రామస్థులు, మహిళలు మూకుమ్మడిగా కర్రలు, కారంపొడి, వడిసెలు, రాళ్లతో ఎదుర్కొన్నారు. పోలీసులు కాల్పులు జరిపి సంఘం నాయకులను పట్టుకొని చేతులు, కాళ్లకు సంకెళ్లు వేసి వలిగొండ నిజాం పోలీస్‌స్టేషన్‌కు తరలించేందుకు



స్థానిక జాగీర్దార్ గడిలో నిర్బంధించారు. సంఘం నాయకులను తీసుకెళ్తుండగా రెచ్చిపోయిన గ్రామస్థులు మరోసారి జగీర్దార్ గడిపై దాడి చేయగా అప్పుడు పోలీసులు జరిపిన కాల్పుల్లో కొమ్మిడి హనుమారెడ్డి నేలకొరిగారు.

దాడి నేపథ్యంలో నిజాం పోలీసులకు చిక్కిన సుమారు 40 మంది రైతులు వాకిటి మల్లయ్య, బొందయ్య, నక్కల బుచ్చిరెడ్డి, బుగ్గ వీరయ్య, వేముల మల్లయ్య, వేముల నర్సయ్య, వేముల ముత్తయ్య, తదితరులను జైలుకు పంపారు. యూనియన్ మిలిటరీ చేతిలో వాకిటి పెద్ద పుల్లారెడ్డి రజాకార్ల చేతిలో దొడ్డి ఎల్లయ్యలు మరణించారు. పులిగిల్ల వాసులను పీడించిన పట్వారి బుచ్చిరెడ్డి, గుమస్తా రంగయ్య సంఘం దళాల చేతుల్లో చనిపోయినట్లు స్థానికులు చెప్పారు.

# మెరుగవనున్న విద్యుత్తు సరఫరా

సిద్దిపేట : జిల్లాలో వ్యవసాయానికి, గృహాలు, ఇతర అవసరాలకు మెరుగైన విద్యుత్తు సరఫరా అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా పదకొండు 33/11 కేవీ ఉపకేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం 32.08 కోట్ల నిధులు మంజూరు చేసింది. అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లి, రేగొండ, పంతులుతాండ, కొమురవెల్లి మండలంలోని ఐనాపూర్, మర్రిముస్త్యాల, దూళ్మిట్ట మండలంలోని హనుమతండా, మద్దూరు మండలంలోని వంగపల్లి, జగదేవపూర్ మండలంలోని దౌలాపూర్, సిద్దిపేట పట్టణ పరిధి నర్సాపూర్ రెండు పడక గదుల సముదాయం, కోహెడ మండలంలోని గొట్లమిట్ట, గజ్వేల్ మండలంలోని ముట్రాజ్‌పల్లి ఆర్అండ్ఆర్ కాలనీలో 33కేవీ విద్యుత్తు ఉపకేంద్రాలను ప్రభుత్వం నూతన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది.

విద్యుత్తు డిమాండ్ పెరిగి..

గతంలోనే నర్సాపూర్, ముట్రాజ్‌పల్లి విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణానికి ఇదివరకే అనుమతులు రాగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జిల్లాలో బోరుబావులపై ఆధారపడి వ్యవసాయం సాగు చేస్తున్నారు. విద్యుత్తు వినియోగం ఎక్కువగా ఉంటుంది. గృహావసరాలకు భారీగా విద్యుత్తు డిమాండ్ పెరిగి లోవోల్టేజీ సమస్య ఉత్పన్నమవుతోంది. మోటార్లు కాలిపోయి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. ఉపకేంద్రాల నిర్మాణాలు పూర్తయి అందుబాటులోకి వస్తే మెరుగైన విద్యుత్తు లభించనుంది.



# గోవాలో జానీ మాస్టర్ అరెస్ట్

హైదరాబాద్: కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీబాషాను పోలీసులు అరెస్ట్ చేశారు. సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసు బృందం గోవాలోని లాడ్జిలో అతడిని అదుపులోకి తీసుకుంది. అక్కడి కోర్టులో హాజరు పరిచి నగరానికి తీసుకొస్తున్నారు. నేరుగా ఉప్పరపల్లి కోర్టులో జానీ మాస్టర్‌ను హాజరుపరిచే అవకాశముంది. తనపై పలుమార్లు అత్యాచారం చేశాడంటూ ఓ మహిళా అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ (21) ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది.

బాధితురాలు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి నార్సింగికి బదిలీ చేశారు. అతడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి జానీ మాస్టర్‌ను అరెస్ట్ చేశారు.

**బాధితురాలి ఫిర్యాదులో ఏముందంటే..** “2017లో జానీ మాస్టర్ పరిచయమయ్యాడు. 2019లో అతని బృందంలో సహాయ నృత్య దర్శకురాలిగా చేరాను. ముంబయిలో ఓ సినిమా చిత్రీకరణ నిమిత్తం జానీ మాస్టర్‌తో పాటు నేను, మరో ఇద్దరు సహాయకులం వెళ్లాం. అక్కడ హోటల్‌లో నాపై జానీ మాస్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే పని నుంచి తొలగిస్తానని, సినిమా పరిశ్రమలో ఎప్పటికీ పనిచేయలేవని బెదిరించాడు. దీన్ని అవకాశంగా తీసుకుని.. హైదరాబాద్ నుంచి ఇతర నగరాలకు సినిమా చిత్రీకరణకు తీసుకెళ్లిన సందర్భాల్లో అనేకమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. షూటింగ్ సమయంలోనూ వ్యానిటీ వ్యాన్‌లో అసభ్యంగా ప్రవర్తించేవాడు. లైంగిక వాంఛ తీర్చనందుకు ఒకసారి జుట్టు పట్టుకుని తలను అద్దానికి కొట్టాడు. మతం మారి.. తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసేవాడు. వేధింపులు భరించలేక జానీ మాస్టర్ బృందం నుంచి బయటకొచ్చేశాను. అయినా సొంతంగా పనిచేసుకోనివ్వకుండా, ఇతర ప్రాజెక్టులు రాకుండా ఇబ్బందిపెట్టాడు. ఆగస్టు 28న మా ఇంటి గుమ్మానికి గుర్తుతెలియని వ్యక్తులు ఓ పార్సిల్ వేలాడదీశారు. ‘మగబిడ్డకు అభినందనలు. కానీ జాగ్రత్తగా ఉండు’ అని అందులో రాసి ఉంది” అని ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది.

## ఆర్టీసీకి మహాలక్ష్మి అండ





దుబ్బాక : మహాలక్ష్మీ పథకం అమలు చేయడంతో ఆర్టీసీ బస్సులకు ఆదరణ పెరిగింది. పథకం అమలుకు ముందు ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో అధికంగా ప్రయాణించేవారు. ఫలితంగా ఆర్టీసీ బస్సులకు ఆదరణ తక్కువగా ఉండేది. దీంతో వివిధ రూట్లలో బస్సులు ఖాళీగా తిరిగేవి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ సర్వీసుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తోంది. దీంతో మహిళలు ప్రయాణ సమయాల్లో ఆర్టీసీ బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. మహిళలతో పాటు పురుషులు సైతం ఆర్టీసీ బస్సుల్లోనే అత్యధిక మంది ప్రయాణిస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులకు బాగా డిమాండ్ పెరిగింది. ఫలితంగా సిద్దిపేట ఆర్టీసీ డిపో ఆక్యుపెన్సీ రేషియో గణనీయంగా పెరిగిపోయింది. పథకం అమలుకు ముందు రోజు 30వేల మంది ప్రయాణికులను సిద్దిపేట ఆర్టీసీ బస్సులు వారి గమ్యస్థానాలకు చేర్చేవి. ప్రస్తుతం రోజుకు 45వేల నుంచి 50వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతున్నాయి. దీంతో రోజుకు మహాలక్ష్మి టికెట్లుతో సహా రూ.22లక్షల ఆదాయం సిద్దిపేట ఆర్టీసీ డిపోనకు సమకూరుతోందని అధికారులు చెబుతున్నారు. దుబ్బాక డిపో బస్సుల్లో ఇది వరకు రోజుకు 15వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేవారు. ప్రస్తుతం రోజుకు 22వేల నుంచి 25వేల మంది ప్రయాణిస్తుండగా రోజుకు రూ.8లక్షల ఆదాయం సమకూరుతోంది.

**7 ప్రధాన రూట్లలో ట్రిప్పులు..** సిద్దిపేట ఆర్టీసీ డిపో నుంచి 7 ప్రధాన రూట్లలో ఆర్టీసీ అధికారులు బస్సులు తిప్పుతున్నారు. సిద్దిపేట–సికింద్రాబాద్, మెదక్, కామారెడ్డి, హనుమకొండ, వేములవాడ, బీదర్, సోలాపూర్‌కు బస్సులు నడుపుతున్నారు. వీటితో పాటు పాఠశాల విద్యార్థుల కోసం 13 బస్సులను ప్రత్యేకంగా ఉదయం, సాయంత్రం వేళల్లో సిద్దిపేట పరిసర గ్రామాలకు నడుపుతున్నారు. సిద్దిపేట డిపోలో మొత్తం 97బస్సులు ఉన్నాయి. వీటిలో 44బస్సులు ఆర్టీసీ, 53 ప్రైవేటుకు చెందినవి. మరోవైపు దుబ్బాక–సిద్దిపేట, మిరుదొడ్డి, సికింద్రాబాద్, కామారెడ్డి, నారాయణఖేడ్, చేగుంట, తిరుపతి వంటి ఏడు ప్రధాన రూట్లలో అధికారులు బస్సులను నడుపుతున్నారు. దుబ్బాక డిపోలో 33 బస్సులు ఉన్నాయి.

## దసరా సెలవులు ప్రకటించారోచ్..

గణేష్ నవరాత్రి ఉవత్సవాలు ముగిసాయి. ఇప్పుడు దసరా నవరాత్రి ఉత్సవాలు రానున్నాయి. తెలుగు మాస క్యాలెండర్ ప్రకారం ఈ ఏడాది దసరా పండుగ అక్టోబర్ 12వ తేదీన రానుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దసరా సెలవులను డిక్లేర్ చేసింది. అక్టోబర్ 2వ తేదీ నుంచి 14వ తేదీ వరకు సెలవులు ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ పాఠశాల విద్యాశాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. 15వ తేదీ నుంచి యధావిధంగా స్కూల్స్ ప్రారంభమవుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.




**దసరా, బతుకమ్మ సంబరాలు..** 2024లో దసరా పండుగ అక్టోబర్ 12వ తేదీన వచ్చింది. దీనికి ముందు బతుకమ్మ సంబరాలు తొమ్మిరోజుల పాటు కొనసాగనున్నాయి. ఎంగిలి బతుకమ్మ పండుగ అక్టోబర్ 2వ తేదీన చేస్తారు. ఆ తరువాత దుర్గాష్టమి రోజున సద్దుల బతుకమ్మతో ఈ సంబరాలు ముగుస్తాయి. అంటే దసరాకు రెండు రోజుల ముందు సద్దుల బతుకమ్మ పండుగను ప్రజలు చేసుకోనున్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

# స్కిల్ వర్సిటీ నిర్వహణకు రూ. 100 కోట్లు కేటాయిస్తాం: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ నిర్వహణకు ప్రభుత్వం తరఫున రూ.100కోట్లు కేటాయిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. యూనివర్శిటీ పూర్తిస్థాయి నిర్వహణకు కార్పస్‌ఫండ్ ఏర్పాటుకు ముందుకు రావాలని సీఎం కోరారు. సచివాలయంలో తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ బోర్డుతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, యూనివర్శిటీ బోర్డు ఛైర్మన్ ఆనంద్ మహీంద్ర, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితోపాటు వివిధ రంగాల పారిశ్రామికవేత్తలు ఉన్నతాధికారులు హాజరయ్యారు. యూనివర్శిటీ నిర్వహణకు ఎవరికి తోచింది వారు వివిధ రూపాలలో సహకారం అందించాలని సీఎం కోరారు. ఈ ఏడాది నుంచే స్కిల్ యూనివర్శిటీలో ప్రారంభించే పలు కోర్సులతోపాటు కీలక అంశాలను అధికారులు పారిశ్రామిక వేత్తలకు వివరించారు. తెలంగాణ నుంచి నైపుణ్యం కలిగిన యువతను ప్రపంచానికి అందించాలన్న సీఎం ఆలోచన గొప్పదని ఆనంద్ మహీంద్రా కొనియాడారు. మంచి విజన్ ఉన్న నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి అంటూ ప్రశంసించారు. అందుకే యూనివర్సిటీ బోర్డు ఛైర్మన్‌గా ఉండాలని ఆయన కోరగానే అంగీకరించినట్లు ఆనంద్ మహీంద్రా తెలిపారు.

## అక్కసుతోనే ఆరోపణలు.. విపక్షాలపై మంత్రి ఆగ్రహం..

హైదరాబాద్, సెప్టెంబర్ 18: విపక్ష పార్టీపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక ప్రతిపక్ష పార్టీలు తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గురువారం నాడు మీడియాతో మాట్లాడిన ఆయన.. గత ప్రభుత్వం చేసిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే తమపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీలే కాదు.. ఇవ్వని హామీలను కూడా రేవంత్ సర్కార్ నెరవేరుస్తోందన్నారు. విద్య, వైద్యంపై తమ ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో ఉందన్నారు. మిషన్ భగీరథపై సర్వే చేస్తే 53 శాతం ఇళ్లకు మంచి నీళ్లు రావడం లేదని తేలిందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రూ. 73 వేల కోట్లు వ్యవసాయ రంగానికి కేటాయించామన్నారు. రూ. 18 వేల కోట్లు రైతు రుణమాఫీ చేశామన్నారు. అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ పక్కాగా జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఇరిగేషన్‌లో రూ. లక్ష కోట్లు, మిషన్ భగీరథ పేరుతో రూ. 15 నుంచి 20 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని మంత్రి పొంగులేటి ఆరోపించారు. బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో ఏమీ చేయలేదని విమర్శించారు. పని చేస్తున్న కాంగ్రెస్‌పై గత పాలకులు బట్టకాల్చి మీద వేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులో గానీ.. వచ్చే నెల మొదటి వారంలో కానీ అర్హులైన వారికి రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు. దార్శనికత ఉండాలి కానీ.. అవకాశవాదం ఉండకూడదన్నారు. ఓరుగల్లు అభివృద్ధిని గత పాలకులు పట్టించు కోలేదని మంత్రి విమర్శించారు.



రాష్ట్రంలో రూ. 650 కోట్లు విద్య కోసం ఖర్చుచేసి తమ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. 119 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ని కట్టించబోతున్నామని మంత్రి చెప్పారు. 25 ఎకరాలలో ఒక్కొక్క ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ని నిర్మిస్తున్నామన్నారు. రూ. 110 కోట్లతో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి చెప్పారు. ప్రతిపక్షంగా చెప్పుకుంటున్న వారు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి జీర్ణించుకోలేకపోతున్నారని.. అందుకే ప్రతి దాన్ని రాద్ధాంతం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. వారి ప్రభుత్వ హయాంలో వారు చేసి చేసిన తప్పులు.. ఇప్పుడూ జరుగుతున్నాయనే భ్రమలో బ్రతుకుతున్నారంటూ బీఆర్ఎస్ నేతలనుద్దేశించి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఎద్దేవా చేశారు.

## జమిలి ఎన్నికల నిర్వహణ అమలుకు కమిటీ : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్ : జమిలి ఎన్నికల నిర్వహణ అమలుకోసం కేంద్రం ఓ కమిటీని ఏర్పాటు చేయనుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా ఐదేళ్ల పాటు ఏదో ఒకచోట పోలింగ్ జరుగుతున్నందున ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం, తద్వారా విధానపరమైన నిర్ణయాలు తీసుకోలేక ప్రభుత్వ నిర్ణయాలకు ఆటంకంగా మారాయన్నారు. కొన్నిసార్లు సాధారణ నిర్ణయాలు కూడా తీసుకోలేని పరిస్థితి ఏర్పడినట్లు చెప్పారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. అసెంబ్లీలు, పార్లమెంటుకు జరుగుతున్న ఎన్నికలకు ఫుల్‌స్టాప్ పెట్టి.. జమిలి ఎన్నికలు జరపాలని నిర్ణయించడం స్వాగతించదగిన పరిణామం అన్నారు. ఎన్నికల ర్యాలీలు, బహిరంగ సభల కారణంగా.. ట్రాఫిక్ జామ్, ధ్వనికాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

వేర్వేరుగా ఎన్నికల నిర్వహణ కారణంగా ఖజానాపై ఆర్థికంగా భారం పడుతోందని చెప్పారు. పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించడంతో జరుగుతున్న ఖర్చు రూ.4,500 కోట్ల పైమాటేనన్నారు. జమిలి ఎన్నికల నిర్వహణపై కేంద్రమంత్రివర్గం తీసుకున్న నిర్ణయంపై.. దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుందన్నారు. ప్రస్తుతం వ్యతిరేకిస్తున్న పార్టీలు త్వరలోనే దీనికి సహకరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



## హైడ్రా నెక్స్ట్ టార్గెట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: చెరువులపై అక్రమ నిర్మాణాల కూల్చివేతే లక్ష్యంగా హైడ్రా దూసుకెళ్తోంది. రాష్ట్రంలో చెరువులు, నాళాలపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేసే పనిలో వేగం పెంచింది హైడ్రా. ఇప్పటికే అనేక అక్రమ నిర్మాణాలు నేలకూలాయి. ప్రస్తుతం కొద్ది రోజులు నిర్మాణాల కూల్చివేతకు గ్యాప్ తీసుకున్న హైడ్రా మళ్లీ విజృంభించేందుకు సిద్ధమైంది. హైడ్రా నెక్స్ట్ ఫోకస్ హుస్సేన్ సాగర్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణాలే. ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన థ్రిల్ సిటీ, జలవిహార్ పై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జలవిహార్‌ను కూల్చి వేయాలంటూ హైడ్రాకు సీపీఐ జాతీయ నేత, మాజీ ఎంపీ అజీజ్ పాషా ఫిర్యాదు చేశారు. హుస్సేన్‌సాగర్‌ను కబ్జా చేసి శాశ్వత నిర్మాణాలు చేపట్టిన జలవిహార్ పై చర్యలు తీసుకోవాలంటు డిమాండ్‌లు భారీగా వినిపిస్తున్నాయి. జలవిహార్ ఆక్రమణకు సంబంధించిన పూర్తి వివరాలను హైడ్రా కమిషనర్‌కు సీపీఐ నేతలు అందజేశారు. హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో 12.5 ఎకరాల్లో జలవిహార్ ఏర్పాటు అయ్యింది. హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధి జలవిహార్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఫోరమ్ ఫర్ బెటర్ హైదరాబాద్ కోర్టును ఆశ్రయించింది. 2007 లో జలవిహార్ ప్రారంభమైంది. జలవిహార్‌కు అప్పటి ప్రభుత్వం 30 ఏళ్ళు లీజ్‌కు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. జలవిహార్‌లో వాటర్ పార్క్, ఫంక్షన్ హాల్స్ ఉన్నాయి. సందర్శకుల ద్వారా వచ్చే డబ్బులు, ఫంక్షన్ హాల్స్ ద్వారా కోట్ల రూపాయలను జలవిహార్ ఆర్జిస్తోంది. జలవిహార్ వ్యర్థాలు అన్ని హుస్సేన్ సాగర్‌లోకే వెళతాయి. ఈ క్రమంలో జలవిహార్‌కు సంబంధించి ఫిర్యాదుల వెల్లువెత్తిన నేపథ్యంగా హైడ్రా నెక్స్ట్ టార్గెట్‌గా జలవిహారం నిలిచింది.

## కేటీఆర్.. మాకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదు

హైదరాబాద్, సెప్టెంబర్ 19: బీసీ కుల గణనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ..“ బీసీ కులగణన మీద కేటీఆర్ మాకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదు” అంటూ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అనేక సందర్భాల్లో ఎంత జనాభా అంత వాటా అని చెప్పారన్నారు. అసెంబ్లీలో ఇప్పటికే బీసీ కులగణన బిల్లు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

బీసీ కులగణన కోసం జీవో విడుదల చేశారని.. త్వరలోనే కులగణన జరుగుతుందని సీఎం చెప్పారన్నారు. 42శాతం రిజర్వేషన్‌కు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. “మేము అడిగితే చేశారని చెప్పుకునే కుటిల బుద్ధితో వ్యవహరిస్తున్నారు. పదేళ్లలో కుల గణన చేయాలనే ఆలోచన ఎందుకు మీకు రాలేదు. బీఆర్ఎస్ ప్రెసిడెంట్.. వర్కింగ్ ప్రెసిడెంట్.. అసెంబ్లీ ప్రతిపక్ష నేత పదవుల్లో బీసీలు ఎవరూ లేరు. మీలాగా తండ్రి చాటున కొడుకుగా.. మామ చాటున ల్లుడిగా రేవంత్ రెడ్డి ఎదగలేదు” అంటూ విమర్శించారు.

**కేటీఆర్‌కు సవాల్ విసిరే హక్కు లేదు..** పీసీసీ చీఫ్ పదవి బీసీలకు ఇచ్చామన్నారు. భవిష్యత్‌లో బీసీలకు మరింత అవకాశాలు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. “మీరు మాకు డెడ్ లైన్ పెట్టడం ఎంటి..? బీసీ కుల గణన చేసి తీరుతాం.. హైకోర్టు కూడా మూడు నెలలలో నివేదిక పంపాలని సూచించింది తప్పక చేస్తాం. మా పాలన చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారు. మీ పార్టీలో.. ప్రభుత్వంలో ఆ నలుగురే ఉన్నారు.. ఇప్పుడు కూడా ఆ నలుగురే మిగులుతారు. తొమ్మిది ఏళ్ల మీ విధ్వంస పాలనను గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నాం. గల్ఫ్ కార్మికులను మీ ప్రభుత్వం పట్టించుకోలేదు. వారి కోసం మా ప్రభుత్వం జీవో తీసుకువచ్చింది. గల్ఫ్ కార్మికులు మరణిస్తే.. ఐదు లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660